ఈనాడు
విజయనగరం

మంగళవారం అక్టోబరు 8, 2024

విజయనగరం వైభవాన్ని చాటేలా ఉత్సవాలు

ఉచిత దర్శనాలకు ఏర్పాట్లు : ఎమ్మెల్యే


సిరిమాను తయారు చేసే వడ్రంగులతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి, అదితి

విజయనగరం కంటోన్మెంట్, అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరం వైభవాన్ని, సంస్కృతిని చాటిచెప్పే విధంగా ఉత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేపడుతున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్‌తో కలిసి సోమవారం నగరంలోని ఉత్సవ వేదికలను పరిశీలించారు. ముందుగా పైడితల్లిని దర్శించారు. అనంతరం ఆలయ ప్రాంగణాన్ని, క్యూలైన్లను తనిఖీ చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. హుకుంపేట వెళ్లి సిరిమాను తయారీని చూశారు. అయోధ్య మైదానానికి చేరుకుని.. అక్కడి వేదికలకు సంబంధించిన ఇన్‌ఛార్జులతో మాట్లాడారు. విజయనగరం ఉత్సవాలు, సిరిమానోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, పుష్ప ప్రదర్శన, లేజర్ షో, పెట్‌షోను పక్కాగా నిర్వహించాలన్నారు. ఈ ఏడాది ఉచిత దర్శన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే అదితి చెప్పారు. వీఐపీలు ఉదయం, సాయంత్రం మాత్రమే వచ్చేలా చూస్తున్నామన్నారు. డీఆర్వో అనిత, ఉత్సవాల ప్రత్యేక అధికారి త్రినాథరావు, ఆర్డీవో కీర్తి, దేవస్థానం ఈవో ప్రసాదరావు, నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య, సిరిమాను పూజారి వెంకటరావు తదితరులున్నారు.

అమ్మ పండగకు ఆహ్వానం

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: పైడితల్లి అమ్మవారి ఉత్సవాలకు పార్లమెంటు స్పీకర్ ఓం బిర్లా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును జిల్లా నేతలు ఆహ్వానించారు. సీఎం చంద్రబాబును మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కలవగా.. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సోమవారం స్పీకర్‌ను కలిసి ఆహ్వానపత్రం అందించారు.

పండగకు ప్రత్యేక రైలు

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం పైడితల్లమ్మ ఉత్సవాల సందర్భంగా విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం రోడ్డు వరకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు నడపనున్నట్లు తూర్పుకోస్తా రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజరు పేరుతో ప్రత్యేక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 10 నుంచి 16 వరకు 08529 నంబరుతో విశాఖపట్నం - శ్రీకాకుళం రోడ్డు.. 08530 శ్రీకాకుళం రోడ్డు - విశాఖపట్నం నడవనుంది. ప్రతి రోజు విశాఖపట్నంలో ఉదయం 10 గంటలకు మొదలై సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్లలో ఆగి.. మధ్యాహ్నం 12.30 గంటలకు శ్రీకాకుళం చేరనుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభమై 3.55 గంటలకు విశాఖ చేరనుంది. దీనిపై విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ.. ప్రత్యేక రైలును నడపడం పట్ల భువనేశ్వర్, వాల్తేరు రైల్వే అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ముఖ్య అధికారిగా త్రినాథరావు



విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: విజయనగరంలో ఈ నెల 14, 15వ తేదీల్లో జరిగే పైడితల్లి ఉత్సవాలకు దేవాదాయ శాఖ నుంచి ఉత్సవ ముఖ్య అధికారిగా వి.త్రినాథరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా పని చేస్తున్నారు. నిర్వహణ ఏర్పాట్లను సైతం పరిశీలించనున్నారు.

వినతుల వెల్లువ

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 161 అర్జీలు వచ్చాయి. భూ సమస్యలకు సంబంధించి 102, డీఆర్‌డీఏ 25, పురపాలక 14, పంచాయతీరాజ్ 16, విద్య, వైద్యశాఖలకు నాలుగేసి చొప్పున వచ్చాయి. సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎస్.డి.అనిత వినతులు స్వీకరించారు.

పింఛను పెంచాలని విన్నపం



సౌమ్యను ఎత్తుకుని తీసుకువస్తున్న తండ్రి

పుట్టుకతోనే దివ్యాంగురాలైన తన కుమార్తె సౌమ్యకు సదరం ధ్రువపత్రం అందించి పింఛను పెంచాలని బొండపల్లి మండలం అంబటివలస గ్రామానికి చెందిన కళ్లంపూడి అప్పలనాయుడు అధికారులకు విజ్ఞప్తి చేశారు. 100 శాతం వైకల్యం ఉన్నా.. గతంలో సదరం ద్వారా 86 శాతం ఉన్నట్లు ధ్రువపత్రం ఇచ్చారని, దీంతో పూర్తిస్థాయిలో లబ్ధి చేకూరడం లేదని వాపోయారు.

వేతనాలకు విన్నపం

చోదకులు, సహాయకులకు జీవో నెం.7 వర్తింపజేసి, వేతనాలు పెంచాలని ఆంధ్రప్రదేశ్ పశు సంచార వైద్య సేవ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. గత ప్రభుత్వ హయాంలో 2022లో వాహనాలు ప్రారంభించి పొరుగుసేవల కింద సిబ్బందిని నియమించిందని, అప్పటి నుంచి జీవో ప్రకారం వేతనాలు చెల్లించడం లేదని తెలిపారు.


పశుసంచార వైద్యసేవ ఉద్యోగులు



రాబోయే సవాళ్లను ఎదుర్కోవాలి


వృద్ధులను సత్కరిస్తున్న నాయకులు


మాట్లాడుతున్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఉపకులపతి కట్టీమని

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు ఎప్పుడూ హక్కులు, పోరాటాలే కాకుండా రాబోయే సవాళ్లను ఎదుర్కోవాలని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఉపకులపతి కట్టీమని పిలుపునిచ్చారు. ఎప్పటికప్పుడు పనితీరును మెరుగుపర్చుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా మారాలన్నారు. ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుకల్లో భాగంగా నగరంలో రెండో రోజు నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. సమాజంలో ఎలాంటి విద్యార్థినైనా గొప్ప వ్యక్తిగా తయారు చేసే శక్తి ఉపాధ్యాయుడికే ఉందన్నారు. వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎడ్మ మాధవరెడ్డి మాట్లాడుతూ ప్రజల భాషలో విద్యావిధానం ఉండాలని పేర్కొన్నారు. నూతన జాతీయ విద్యావిధానం పాలసీలో మార్పులు అవసరమని విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనరు డి.రమేష్ పట్నాయక్ విన్నవించారు. ప్రముఖ ఆర్థిక రంగ విశ్లేషకుడు డి.పాపారావు, నవోదయ సాహిత్య సమితి ప్రతినిధి జతిన్‌కుమార్, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వరరావు, ఏపీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పుత్ర సత్యశర్మ మనుమడు, ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు, ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఎనభై ఏళ్లు నిండిన ఎనిమిది మంది ఉపాధ్యాయులు, ఏపీటీఎఫ్ కార్యకర్తలను సన్మానించారు.

లింగ వివక్ష తగదు..

అన్ని రంగాల్లో ముందుకెళ్తేనే మహిళా సాధికారత సాకారమవుతుందని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకురాలు ఎ.కిరణ్ జ్యోతి అన్నారు. స్థానికంగా జరిగిన మహిళా సదస్సులో ప్రసంగించారు. వందేళ్ల క్రితం ఉన్న లింగ వివక్ష నేటికీ కొనసాగుతోందని, ఇది తగదన్నారు. ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ నాయకురాలు దేవళ్ల ప్రసన్న, ఏపీటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు ఎన్.శ్రీదేవి, బాలా త్రిపుర సుందరి తదితరులు హాజరయ్యారు.

దరఖాస్తు చేద్దాం.. కలిసి కుమ్మేద్దాం..

అన్నా.. కుప్పలు తెప్పలుగా దరఖాస్తు చేస్తున్నారు.. లాటరీలో ఏ దుకాణం ఎవరికి వస్తుందో చెప్పలేం.. అదృష్టం బట్టి ఆధారపడి ఉంటుంది. నాకు వస్తే మిమ్మల్ని కలుపుకొని పోతా. మీకొస్తే నాకు పది పైసలు లోపే వాటా ఇవ్వండి చాలు.
సరే తమ్ముడు.. ముందు దరఖాస్తు చేద్దాం.. ఆ తర్వాత దుకాణం ఎవరికొచ్చినా కలిసి చేసుకుందాం.

అన్నా.. చాలా మంది దరఖాస్తు చేస్తున్నారు.. ఎలా ఉంటుందో..
అది సరే.. నువ్వు ఎన్ని దుకాణాలకు దరఖాస్తు చేద్దామనుకుంటున్నావు.. మూడు దుకాణాలకు.. రూ.రెండేసి లక్షల చొప్పున మూడు డీడీలు తీసి ఇవ్వు.. అందరం కలిసి వేసుకుందాం.. ఆన్‌లైన్‌లో కదా.. ఎవరెవరు వేస్తారో మనకు తెలియదు.. ఎక్కువ మంది దరఖాస్తు చేసే అవకాశం ఉంది. మన తరఫున ఎక్కువ వేద్దాం. ఆపై మన అదృష్టం.. మనకే వస్తే కలిసి వ్యాపారం చేసుకుందాం..
- ఉమ్మడి జిల్లాలో మద్యం వ్యాపారుల మధ్య సంభాషణ ఇది.



ఈనాడు, విజయనగరం

గత ప్రభుత్వం అయిదేళ్లు మద్యం దుకాణాలు సొంతంగా నడిపింది. ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులకు రిటైల్ మద్యం దుకాణాలు లాటరీ ద్వారా కేటాయించనున్నారు. ఈనెల 12 నుంచి కొత్తవి అందుబాటులోకి వస్తాయి. ఇందుకు దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఒక వ్యక్తి ఎన్ని అయినా దాఖలు చేసుకునే వెసులుబాటు కల్పించడంతో ఉమ్మడి విజయనగరం జిల్లాలో పోటెత్తుతున్నాయి. ఇంకా దీనికి రెండు రోజుల గడువు ఉంది. ఈ లోగా మరిన్ని దరఖాస్తులు రానున్నాయి.

రంగంలోకి పాత సిండికేట్లు

ప్రభుత్వ విధానం వెల్లడైన తర్వాత పాత సిండికేట్లు రంగంలోకి దిగారు. ముందు దరఖాస్తు చేద్దాం.. లాటరీలో మనకు దుకాణం దక్కితే కలిసి చేసుకుందాం.. అంటూ వ్యాపారులు కూడబలుక్కుంటున్నారు. గత ప్రభుత్వం విపరీతంగా ధరలు పెంచి అమ్మింది. కూటమి ప్రభుత్వం ఇప్పుడు తగ్గించి నూతన విధానం ప్రకటించింది. అమ్మకాలకు సంబంధించి ఎటువంటి ఆంక్షలు లేకపోవడంతో మన శక్తియుక్తులే వ్యాపారానికి ఆయువు.. అని అనుభవం ఉన్న వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.



ప్రభుత్వ మద్యం దుకాణం


గ్రామీణ దుకాణాలకు గిరాకీ

నగరం, పట్టణాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాలపైనే అందరి కళ్లు పడ్డాయి. అక్కడ ఎక్కువ వ్యాపారం సాగుతుందని వ్యాపారులు నమ్ముతున్నారు. వాటిని చేజిక్కించుకునేందుకు పోటీ పడుతుండటంతో అధిక దరఖాస్తులు వస్తున్నాయి. విజయనగరం జిల్లాలో 153 దుకాణాలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 52 దుకాణాలకు లైసెన్సులు ఇవ్వనున్నారు. వీటిలో విజయనగరం జిల్లాలోనే ఇప్పటి వరకు అత్యధికంగా రికార్డు స్థాయిలో దరఖాస్తులు సమర్పించడం గమనార్హం. సగటున ఒక్కో దుకాణానికి పదికి పైగా దాఖలయ్యే అవకాశం ఉంది. ఎవరికి లాటరీలో తగిలినా కలిసి చేసుకుంటేనే నాలుగు రూపాయలు మిగులుతాయి.. లేకుంటే నష్టపోతామని ముందస్తుగా వ్యాపారుల సంభాషణల్లో వ్యక్తమవుతోంది. మద్యం వ్యాపారంలో గతంలో అనుసరించిన సహజ విధానాన్ని అవలంబించాలని నిర్ణయించారు.

సమావేశాలు.. సమాలోచనలు

మద్యం దుకాణాలపై సిండికేట్

గతంలో మద్యం వ్యాపారంలో అనుభవం ఉన్న సిండికేట్లు సమావేశాలు నిర్వహిస్తూ.. తమతో కలిసొచ్చే వారితో సమాలోచనలు చేస్తున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో మద్యం సిండికేట్ నడపడంలో దిట్టగా గుర్తింపు పొందిన వ్యాపారి ఒకరు ద్వితీయ శ్రేణి నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. బొబ్బిలి, రాజాం, పాలకొండ, సాలూరు, గజపతినగరం నియోజకవర్గాల్లో పాత వ్యాపారులే పోటీపడుతున్నారు. ఎంత మంది ఎన్ని దరఖాస్తులు సమర్పిస్తే అంత ఆదాయం ప్రభుత్వానికి చేరుతుందనే ఉద్దేశంతో ఎక్సైజ్ శాఖ అధికారులు సైతం పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారు. దరఖాస్తు చేసుకోండి.. అదృష్టాన్ని పరీక్షించుకోండని.. చెబుతున్నారు. ఎస్.కోట, సాలూరు, పార్వతీపురం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలకు చెందిన వారు కలిసి వ్యాపారం చేసుకునేందుకు ఆసక్తి చూపడం గమనార్హం. విజయనగరం నియోజకవర్గం పరిధిలో వైకాపా నాయకులకు తప్ప, కూటమి నాయకులకు పెద్దగా ఈ వ్యాపారంపై అనుభవం లేక ముందడుగు వేయాలా.. వద్దా.. అంటూ ఊగిసలాడుతున్నారు.



★ మన్యం జిల్లాలో అన్ని దుకాణాలకు దరఖాస్తు చేశారు. విజయనగరం జిల్లాలో గరివిడి మండలంలో ఓ దుకాణానికి (షాప్ 70) ఒక్క దరఖాస్తూ రాలేదు.

ప్రజాదర్బార్‌లో 1200 అర్జీలు


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఎస్.కోట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు 1200 పైగా అర్జీలు వచ్చాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎందరో అర్హులు పథకాలకు నోచుకోలేదని, వారందరికీ న్యాయం చేస్తామన్నారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యలను క్రోడీకరించి నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళిక తయారు చేస్తామన్నారు. పింఛన్లకు సంబంధించి 464, రెవెన్యూ సమస్యలకు 558, గృహనిర్మాణశాఖ సమస్యలు 59, ఇతర అర్జీలు కలిపి మొత్తం సుమారు 1200 అర్జీలు అందాయని ఎంపీడీవో ఎం.సతీష్ చెప్పారు. ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుబ్బలక్ష్మి, సర్పంచి జి.సంతోషికుమారి, తెదేపా మండల అధ్యక్షుడు జీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోటీ చేశానని గ్రామం నుంచి వెలేశారు

వైకాపా నాయకులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: గతంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో వైకాపా మద్దతుదారుడికి వ్యతిరేకంగా పోటీ చేశానని ఆ పార్టీ నాయకులు తమ కుటుంబంపై కక్ష గట్టి గ్రామం నుంచి వెలేశారని జామి మండలం మధుర నారాయణపురం గ్రామానికి చెందిన శీర దేముడు ఆరోపించారు. గత అయిదేళ్లలో తనపై జరిగిన దౌర్జన్యాలపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ మేరకు సోమవారం విజయనగరంలోని కలెక్టరేట్ వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేపట్టారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఉప సర్పంచి దేముడు, ఆయన అనుచరులు పలుమార్లు తన కుటుంబంపై దౌర్జన్యానికి పాల్పడ్డారన్నారు. ఇంటి నిర్మాణాన్ని సైతం అడ్డుకున్నారని, నిర్మాణ స్థలాన్ని విడిచిపెట్టకపోతే తన కుమారుడి వివాహాన్ని ఆపేస్తామని బెదిరించారన్నారు. శుభకార్యాలకు రానీయడం లేదని, గ్రామం నుంచి తరిమేందుకు యత్నిస్తున్నారన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దేముడు కుటుంబ సభ్యులు

పల్లె విస్తోన్న ప్రగతి

- జోరుగా అభివృద్ధి పనులు
- వీధిదీపాలు, తాగునీటికి అడుగులు


జీసీహెచ్ పల్లెలో మురుగునీటి వ్యవస్థ ప్రజలను ఇబ్బంది పెడుతోంది. కూటమి ప్రభుత్వం ఇటీవల పంచాయతీకి నిధులు సమకూర్చడంతో రూ.4 లక్షలతో మురుగునీటి వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు.

పల్లెలు ప్రగతి వైపు అడుగులు వేస్తున్నాయి. నిధుల్లేక కునారిల్లుతున్న పంచాయతీలకు ఎన్డీయే ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులిచ్చి సాంత్వన కలిగించింది. వీధి దీపాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక వసతుల కల్పనకు జోరుగా అడుగులు పడుతున్నాయి. గత వైకాపా ప్రభుత్వం 14వ ఆర్థిక సంఘం నిధులను విద్యుత్తు బిల్లుల బకాయిలకు మళ్లించేసింది. దీంతో పంచాయతీలు నిధుల్లేక దాదాపు అచేతనావస్థకు చేరాయి. వీటికి పూర్వ వైభవం తీసుకొస్తామని సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాటిచ్చారు. ఆ మేరకు ఉమ్మడి జిల్లాకు రూ.46.70 కోట్లు టైడ్, అన్‌టైడ్ నిధులు అందుబాటులోకి రావడంతో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి.

– న్యూస్‌టుడే, రాజాం

నిధులు ఇలా..

జిల్లా	పంచాయతీలు	జనాభా	నిధులు (రూ.కోట్లు)
విజయనగరం	773	15,57,057	30.74
మన్యం	451	7,90,438	15.96

పంచాయతీలకు జీవం

పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులే ప్రధాన ఆధారం. వైకాపా ప్రభుత్వం ఈ నిధులను దారి మళ్లించడంతో అభివృద్ధి పనులే కాదు.. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి కనీస అవసరాలు తీర్చేందుకు వీలులేకుండా పోయింది. ఎన్డీయే ప్రభుత్వం 2023-24 సంవత్సరానికి రెండో విడత నిధులను ఖాతాల్లో జమ చేయడంతో ఊరట కలిగింది. ఇప్పటికే చాలా చోట్ల కాలువల నిర్మాణం చేపట్టారు. ఇక నుంచి వీటికి ఉపాధి నిధులు వెచ్చిస్తారు. ఆర్థిక సంఘం నిధులు ఇతర అవసరాలకు ఖర్చు చేస్తారు.

ప్రజలకు మేలు చేసేలా...

ఆర్థిక సంఘం నిధులను నిబంధనల ప్రకారం ఖర్చు చేయాలని చెప్పాం. రహదారులు, కాలువల నిర్మాణాలకు ప్రభుత్వం ఉపాధి నిధులు కేటాయించింది. ఆర్థిక సంఘం నిధులతో తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలని చెప్పాం. ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను జమ చేయడంతో ఇవన్నీ సాకారమవుతున్నాయి. - వెంకటేశ్వరరావు, డీపీవో


రాజాం మండలంలోని అతి పెద్ద గ్రామాల్లో ఒకటైన కంచరాంలో ఇప్పటికీ కాలువలు, రహదారుల సమస్య ఉంది. ఇటీవల ఆర్థిక సంఘం నిధులు పంచాయతీకి జమ కావడంతో రూ.3 లక్షలు వెచ్చించి వరద కాలువ నిర్మించారు. ఇతర వసతులపై దృష్టి పెడుతున్నారు.

అంతరాయం లేని విద్యుత్తు అందిస్తాం

ముఖాముఖి

పాడైన వాటి స్థానంలో కొత్త నియంత్రికలు

'న్యూస్‌టుడే'తో ఈపీడీసీఎల్ ఎస్ఈ



– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

విద్యుత్తు వినియోగదారులకు అంతరాయం లేని నిరంతర సరఫరాయే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ విజయనగరం సర్కిల్ పర్యవేక్షణ ఇంజినీరు ఎం.లక్ష్మణరావు తెలిపారు. నియంత్రికలు పాడైతే వెంటనే మార్చుతున్నామని చెప్పారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. లక్షల మంది భక్తులు తరలివచ్చే పైడితల్లి సిరిమానోత్సవానికి సిద్ధంగా ఉన్నామని, శాఖాపరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకుంటామని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణ, ప్రజలు, సిబ్బందికి అవగాహన, సూర్యఘర్ పథకం.. తదితర అంశాలపై సోమవారం 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో మాట్లాడారు.

ఆ సమయంలో నిలుపుదల..

సిరిమాను తిరిగే మార్గంలో తీగలను సరిచేశాం. రథానికి తగలకుండా తగిన ఏర్పాట్లు చేశాం. ఉత్సవం రోజున సరఫరా నిలిపివేస్తాం. ఊరేగింపు పూర్తయ్యాక.. సంబంధిత వర్గాల నుంచి అనుమతులు రాగానే పునరుద్ధరిస్తాం. సమాచారం, సందేహాలు, సూచనల కోసం మూడులాంతర్లు వద్ద కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నాం. 24 గంటల పాటూ సిబ్బంది విధుల్లో ఉంటారు.

గత అయిదేళ్లలో మంజూరు చేయలేదు..

జిల్లా వ్యాప్తంగా ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు చేపడుతున్నాం. అందుకే అప్పుడప్పుడూ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ఈమేరకు ముందుగానే సమాచారం ఇస్తున్నాం. కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి కేంద్రం నుంచి ప్రత్యేకంగా నిధులు రావాలి. గత అయిదేళ్లలో ఒక్కటి కూడా మంజూరు కాలేదు. దీంతో కొన్నిచోట్ల ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈమేరకు ప్రతిపాదనలు పంపించాం.

1679 దరఖాస్తులు..

తొలి దశలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సంస్థలు, పరిశ్రమల్లో స్మార్టు మీటర్లు పెడుతున్నాం. ఈ కేటగిరీకి సంబంధించి 87 వేలు అవసరం కాగా.. ఇప్పటివరకు 3,100 వరకు మార్చాం. రెండో దశలో మిగిలిన కేటగిరీలపై దృష్టిసారిస్తాం. పీఎం సూర్యఘర్‌పై విస్తృత అవగాహన కల్పిస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు లబ్ధిచేకూరేలా చూస్తున్నాం. కేటగిరీని బట్టి రూ.78 వేల వరకు రాయితీ పొందవచ్చు. అపార్టుమెంట్లలో ప్లాంటు పెట్టుకుంటే కిలోవాట్‌కు రూ.18 వేల వరకు సబ్సిడీ ఉంటుంది. ఇంత వరకు 1679 దరఖాస్తులు రాగా 248 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 148 మందికి ప్లాంటు మంజూరు చేశాం.

సమస్యల పరిష్కారానికి చర్యలు..

విద్యుత్తు సమస్యల పరిష్కారం కోసం వినియోగదారులు టోల్‌ఫ్రీ నం.1912ను సంప్రదించవచ్చు. మీటరు సర్వీసు నంబరును తెలియజేస్తే సరిపోతుంది. అప్పుడే ఫిర్యాదు నమోదవుతుంది. అలాంటి వాటికి కచ్చితంగా పరిష్కారం దొరుకుతుంది. అంతరాయం, లోవోల్టేజీ, ప్రమాదాలు, పనిచేయని నియంత్రికలు, విద్యుత్తు బిల్లుల్లో లోపాలు, స్తంభాలు వంగిపోవడం, పడిపోవడం, తీగలు వేలాడటం, తెగిపోవడం.. తదితరాల గురించి చెప్పవచ్చు. జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

మన్యంకు 25 మంది కేటాయింపు

విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా దృష్టిసారిస్తున్నాం. ప్రతినెలా 2వ తేదీన సర్కిళ్ల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. భద్రతపై సిబ్బందికి సూచనలు చేస్తున్నారు. వారు ప్రజలను అప్రమత్తంగా చేస్తున్నారు. ఇళ్ల పైనుంచి, పక్కనుంచి తీగలు వెళితే జాగ్రత్తలు పాటించాలి. కొత్తగా మన్యం సర్కిల్ ఏర్పడిన నేపథ్యంలో ఇక్కడి నుంచి నలుగురు జేఈలు, ముగ్గురు జూనియర్ అకౌంట్స్ అధికారులు, తొమ్మిది మంది సీనియర్ సహాయకులు, మరో తొమ్మిది మంది జూనియర్ సహాయకులను పంపించాం.

పసర.. ప్రాణాలు తీస్తోంది



ఈ చిన్నారి పేరు సహస్ర. వయసు నాలుగు నెలలు. గుమ్మలక్ష్మీపురం మండలం మూల జమ్ముకు చెందిన బాలిక ఇటీవల జ్వరం బారిన పడటంతో గ్రామంలో పసర మందు ఇచ్చారు. అస్వస్థతకు గురవడంతో జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు సకాలంలో స్పందించి ప్రాణాలు నిలిపారు.

గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం పట్టణం, కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: పాము కాటుకు గురైనా, అనారోగ్యం బారిన పడినా, ప్రమాదాలు జరిగినా గిరిజనులు ఆసుపత్రులకు రాకుండా పసరు మందును ఆశ్రయిస్తున్నారు. ప్రతి గ్రామానికీ వైద్యం చేరువైనప్పటికీ.. నాటు వైద్యుల వద్దకే వెళ్తూ ప్రాణాలు తీసుకుంటున్నారు. సోమవారం కురుపాం మండలంలో ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది.

కొన్ని ఘటనలు ఇలా..

★ రెండేళ్ల క్రితం కురుపాం మండలం బారామనికి చెందిన నాలుగు నెలల చిన్నారి గ్రీష్మకు కడుపు నొప్పి రావడంతో పసరమందు పట్టారు. ఊపిరితిత్తుల్లోకి చేరడంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదురైంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.

★ రెండేళ్ల క్రితం గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన బాలుడిని పాము కాటేసింది. ఏడాది పాటు పసర మందు వాడడంతో కాలు మొత్తం కుళ్లిపోయింది. తర్వాత జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లగా.. కాలు తొలగించారు.

★ ఏడాది క్రితం గుమ్మలక్ష్మీపురం మండలం అచ్చబలో నివాసముండే అయిదేళ్ల బాలిక అగ్ని ప్రమాదానికి గురవడంతో.. పొట్ట, ఛాతి, చేతులు కాలిపోయాయి. పసర మందు రాసి నెల పాటు ఇంట్లోనే ఉంచారు. పరిస్థితి విషమించిన తరువాత విషయం తెలుసుకున్న పోలీసులు చొరవచూపి ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు.

★ మక్కువ మండలం ఆలుగూడకు చెందిన 8 నెలల శిశువుకు తరచూ కడుపు నొప్పి వచ్చేది. నాటు వైద్యుడిని సంప్రదించగా.. కడుపులో బల్ల ఉందని పొట్టపై వాతలు పెట్టాడు. పుండుగా మారడంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు.

మన్యంలో వరుస ఘటనలు

అందుబాటులో వైద్యం..

మన్యం జిల్లాలోని 12 గిరిజన మండలాల్లో సుమారు 3 లక్షల మంది నివసిస్తున్నారు. ఏటా సుమారు 3 వేలు ప్రసవాలు జరుగుతున్నాయి. వీరికి అందుబాటులో గర్భిణుల వసతి గృహాలు, బర్త్ వెయిటింగ్ హాల్‌లు, 108 వాహనాలు ఉన్నాయి. గ్రామీణ ప్రజలకు అందుబాటులో 350 ఆరోగ్య ఉపకేంద్రాలు, 37 పీహెచ్‌సీలు ఏర్పాటయ్యాయి. కొండలపై నుంచి ఆసుపత్రికి చేరేలా ఫీడర్ అంబులెన్సులు నడుస్తున్నాయి. ఆశా కార్యకర్తలు, ఇతర ఆరోగ్య సిబ్బంది నేరుగా గ్రామాలకు వెళ్లి సేవలు అందిస్తారు.

వైద్యులను సంప్రదించాలి..

ప్రస్తుతం గ్రామ స్థాయిలోనూ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. అనారోగ్యానికి గురైన వారు సమీప ఆసుపత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలి. పసర మందు వాడి ప్రాణాలు తీసుకోవద్దు. గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

– విజయపార్వతి, డీఎంహెచ్‌వో

నాటు వైద్యం వికటించి యువకుడి మృత్యువాత

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కురుపాం మండలం సీడిమానుగూడకు చెందిన ఆరిక మోహనరావు(26)ను మూడు రోజుల క్రితం పాము కాటేసింది. బాధితుడు పసరు వైద్యం తీసుకొని ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం ఇంట్లో స్పృహ తప్పి పడిపోగా కుటుంబ సభ్యులు 108లో కురుపాం సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఆయనకు భార్య శైలజ, రెండు నెలల కుమారుడున్నారు. పసరు వైద్యం ఇంటిపెద్దను దూరం చేసిందని బాధితులు బోరున విలపిస్తున్నారు.

సమీకృత పంటలు.. మెండైన లాభాలు

రెండెకరాల విస్తీర్ణంలో ఎక్కువ పంటలు పండిస్తూ సీతంపేట మండలం దిబ్బగూడకు చెందిన రైతు బంగ్రోతు శ్రీనివాసరావు ఆదర్శంగా నిలుస్తున్నారు. నాలుగేళ్లుగా సేంద్రియ పద్ధతులు అవలంబిస్తున్నారు. వివిధ పండ్ల జాతులు, కూరగాయలు, ఆకు కూరలు పండిస్తూ ఏటా రూ.3 లక్షల మేర ఆదాయం సంపాదిస్తున్నారు.

–న్యూస్‌టుడే, సీతంపేట



సాగు చేస్తున్న అరటి

సాగు విధానం ఇలా..

◆ అన్ని రకాల విత్తనాలు సొంతంగా తయారు చేస్తున్నారు. ◆ యంత్ర పరికరాల వినియోగం ఎక్కువ. ◆ ద్రవ, ఘన జీవామృతాలు, నీమాస్త్రం, అగ్నాస్త్రం, బ్రహ్మాస్త్రం, తూటికాడ కషాయం, పంచగవ్య తదితరాలు సొంతంగా తయారుచేసి వినియోగిస్తున్నారు. ◆ సౌర పథకం ద్వారా సాగు నీరు పొందడంతో విద్యుత్తు బిల్లు ఆదా అవుతుంది.

1.5 ఎకరాల్లో అరటి..

సొంతంగా తయారుచేసిన 600 అరటి విత్తులను 1.5 ఎకరాల్లో నాటారు. మొదటిగా 550కి పైగా గెలలు వచ్చాయి. పరిమాణం బట్టి రూ.250 నుంచి రూ.350 వరకు అమ్మగా రూ.1.75లక్షల ఆదాయం వచ్చింది. దుక్కి, ఇతర పెట్టుబడులు రూ.15వేలు లోపే.

సిరులు కురిపిస్తున్న జామ, మునగ..

అంతర పంటగా గట్లుపై 20 మునగ చెట్లు నాటారు. ప్రస్తుతం 300 కిలోలకు పైగా కాడలు దిగుబడి వచ్చాయి. కిలో రూ.50 చొప్పున రూ.15 వేలకు విక్రయించారు. గతంలో వేసిన 70 జామ చెట్ల నుంచి ఏడాదిలో రెండుసార్లు కలిసి 700 కిలోలకు పైగా పంట చేతికొచ్చింది. కిలో రూ.30 చొప్పున రూ.21 వేలకు అమ్మకాలు చేపట్టారు.

కూరగాయలు, ఆకుకూరలు..

జామ, అరటి తోటల మధ్యలో బెండ, బీర, టమాట, వంగ, మిరప, క్యాబేజీ, ముల్లంగి, చిక్కుళ్లు, క్యారెట్, గోరుచిక్కుళ్లు, కరివేపాకు, ఆనపకాయలు, దొండ, గోంగూర, తోటకూర పండిస్తున్నారు. అనాస, సపోట, సీతాఫలం, బొప్పాయి, కొబ్బరి, జంబో నేరడి, బంతి మొక్కలు ఉన్నాయి. వీటన్నింటి ద్వారా ఏడాదికి సుమారు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షలు ఆదాయం సమకూరుతోంది.



అంతర పంటగా వేసిన అనాస



ఎక్కువ మంది ఆసక్తి..: పూర్తి సేంద్రియ విధానంలో సాగు చేయడంతో ఎక్కువ మంది కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. త్వరలో నాటుకోళ్లు, తేనె పెంపకానికి ఏర్పాట్లు చేస్తున్నాం. గ్రామానికి చెందిన ఐసీఆర్‌పీ బాలరాజు సూచనలు అందించారు. ప్రకృతి వ్యవసాయం హెడ్ విజయ్‌కుమార్ ఇటీవల తనకు పురస్కారం ఇచ్చారు.

– బంగ్రోతు శ్రీనివాసరావు, రైతు, దిబ్బగూడ

రైతేరాజు

అప్రమత్తతతో పత్తిని కాపాడుదాం



కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు తెల్ల బంగారంలా భావించే పత్తి పంటను ఇటీవల పురుగులు ఆశించి ఎదుగుదల, దిగుబడిని దెబ్బ తీస్తున్నాయి. ఆకులు అడుగు భాగంలో గుడ్లు పెట్టి పిల్ల, తల్లి పురుగులు రసం పీల్చడంతో ఆకులు వడలిపోతాయి. పేనుబంక, పచ్చ, తెల్ల దోమలు, తామర, పిల్ల, తల్లి పురుగులు ఉంటే యాజమాన్య చర్యలు చేపట్టాలని రస్తాకుంటుబాయి కేవీకే సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త డా.జి.అమృతవీణ సూచించారు. నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 17.9 ఎస్.ఎల్.0.4 మి.లీ లేదా ఎసిటామిపిడ్ 20 ఎస్.పి 0.2 గ్రాములు లేదా థయోమిథాక్సిమ్ 25 డబ్ల్యూజీ 0.2 గ్రాములు లేదా డైపెన్ థయరాన్ 50 డబ్ల్యూ.పి 1.25 గ్రాములు లేదా ఫ్లోనికామిడ్ 0.3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.

సస్యరక్షణతో చీడపీడలు దూరం



గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పంటల సాగులో సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే చీడపీడల నుంచి పంటను కాపాడి ఆశించిన దిగుబడులు పొందవచ్చని భామిని వ్యవసాయాధికారి **సింహాచలం** తెలిపారు. రైతుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

? పత్తిలో సూక్ష్మలోపానికి ఎలాంటి చర్యలు చేపట్టాలి.?

– వెంకటరమణ, రావివలస

☛ లీటరు నీటికి మెగ్నీషియం సల్ఫేట్ 10 గ్రాములు, బొరెక్స్ 3 గ్రాములు కలిపి మొక్క మొదట్లో పిచికారీ చేయాలి. దీంతో పూత, పిందె రాలకుండా ఉంటుంది. తీవ్రత అధికంగా ఉంటే సమీప వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలను సంప్రదించాలి.

? అపరాల్లో విత్తనశుద్ధి ఎలా.? – రామినాయుడు, బత్తిలి

☛ అపరాల్లో విత్తనశుద్ధి చేస్తే చీడపీడలు సోకే అవకాశం తక్కువగా ఉంటుంది. లీటరు నీటిలో 5 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ కలిపి విత్తనశుద్ధి చేస్తే 15 నుంచి 20 రోజుల వరకు రసం పీల్చే పురుగుల బారి నుంచి పంటలను కాపాడుకోవచ్చు.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

చలికాలం సమీపిస్తున్న తరుణంలో జీవాల పెంపకంలో ఎలాంటి సంరక్షణ చర్యలు చేపట్టాలి. లేగ దూడలు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాల కోసం 94943 25693 నంబరును సంప్రదించాలని గుమ్మలక్ష్మీపురం పశువైద్యాధికారి లక్ష్మణరావు తెలిపారు.

చిరుపొట్ట దశలో జాగ్రత్తలు అవసరం

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో వరి చిరు పొట్ట దశలో ఉంది. ఈ సమయంలో పంటలను రక్షించుకునేందుకు సిఫార్సు చేసిన మందులు పిచికారీ చేయాలని రస్తాకుంటుబాయి కేవీకే శాస్త్రవేత్త డా.జి.అమృతవీణ సూచిస్తున్నారు. ★ కాండం తొలుచు పురుగు మొవ్వను తినేస్తుంది. పూతదశలో కంకి తాలుగా మారుతుంది. దీనికోసం ముందస్తుగా పిలక దశలో ఎకరాకు 10 నుంచి 12 కిలోల కార్బోఫ్యూరడాన్ 3జీ గుళికలు లేదా 4 కిలోల క్లోరాన్‌ట్రానిలిప్రోల్ లేదా 8 కిలోల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు చల్లుకోవాలి. ★ దుబ్బు కుళ్లు తెగులు ఆశిస్తే కంకి పాలు పోసుకునే దశలో కాండం లోపల కణుపుల మధ్య భాగం నల్లగా మారుతోంది. దీని నివారణకు హెక్సాకొనజోల్, వాలిడామైసిన్ మందు సరిపడా నీటిలో కలిపి 15 రోజులకు ఒకసారి పిచికారీ చేయాలి. ★ కంకి దశలో ఎండాకు తెగులు కనిపిస్తుంది. ఆకుల చివర్ల నుంచి మధ్య వరకు పసుపుపచ్చ మచ్చలు ఉంటాయి. పొటాష్ ఎరువు వేయాలి. ప్లాంటోమైసిన్, కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



మోసాలపై 11 ఫిర్యాదులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 48 వినతులు అందాయి. ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ సౌమ్యలత అర్జీదారులతో మాట్లాడారు. భూ తగాదాలకు సంబంధించి 21, కుటుంబ కలహాలపై 3, మోసాలపై 11, ఇతర సమస్యలపై 13 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించి వారం రోజుల్లోగా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్లను ఎస్పీ ఆదేశించారు. ఎస్‌బీ సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కే.చౌదరి, డీసీఆర్‌బీ ఎస్సై రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వ్యతిరేకంగా కలెక్టరేట్ ముట్టడి



కలెక్టరేట్ వద్ద సచివాలయ ఉద్యోగులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయ ఉద్యోగులు సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌ను ముట్టడించారు. కమిషనర్ నల్లనయ్య వ్యవహారశైలిపై ఫిర్యాదు చేసేందుకు తరలి వచ్చారు. ఆయన ప్రవర్తన అమానుషంగా ఉందని, సెలవు దినాలు, ఆదివారాల్లో విధులకు హాజరవ్వాలని ఆదేశిస్తున్నారని ఆరోపించారు. వ్యక్తిగత దూషణలు చేస్తూ అవమానపరుస్తున్నారని వాపోయారు. ప్రతి విషయానికీ నోటీసులు ఇస్తామని బెదిరిస్తున్నారని చెప్పారు. ఇటీవల జరిగిన సమావేశంలో ఓ కార్యదర్శి స్పృహ కోల్పోయి పడిపోయినా పట్టించుకోలేదని మండిపడ్డారు. అనంతరం జేసీ సేధు మాధవన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. మంగళవారం చర్చిద్దామని ఆయన హామీ ఇచ్చారు. వారి పరిధిలో ఉన్న పనులు తప్ప.. ఇతర బాధ్యతలు అప్పగించలేదని కమిషనర్ నల్లనయ్య 'న్యూస్‌టుడే'కు తెలిపారు. పన్నులు వసూలు చేయాలని సూచించామన్నారు.

10 నుంచి అఖిల భారత డ్వాక్రా బజారు

విజయనగరం అయ్యన్నపేట/మయూరికూడలి, న్యూస్‌టుడే: పైడితల్లి సిరిమానోత్సవం, విజయనగరం ఉత్సవాల్లో భాగంగా నగరంలోని ట్యాంకు బండ్ రహదారి వద్ద డ్వాక్రా బజారును ఏర్పాటు చేయనున్నట్లు డీఆర్డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం సంబంధిత అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. రాష్ట్రంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో లభించే ఉత్పత్తులను ప్రదర్శించాలన్నారు. సుమారు 250 స్టాళ్లతో పాటు ఫుడ్ కోర్టు ఏర్పాటు కానుందని, బృందాలుగా ఏర్పడి పర్యవేక్షించాలన్నారు. సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, అప్రమత్తంగా ఉండాలన్నారు.

క్రీడాకారులకు మెరుగైన శిక్షణ

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటేలా శిక్షణ ఇవ్వాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ సూచించారు. సోమవారం జిల్లా క్రీడా ముఖ్య శిక్షకుడు వెంకటేశ్వరరావు ఆయనను కలవగా.. పలు సూచనలు చేశారు. నైపుణ్యమున్న విలువిద్య క్రీడాకారులున్నారని, మరింతగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతిభావంతులను ఎంపిక చేసి జాతీయ స్థాయి క్రీడలకు పంపించాలని చెప్పారు.

అనారోగ్యంతో వృద్ధుడి బలవన్మరణం

బొబ్బిలి, న్యూస్‌టుడే: బావిలో దూకి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బొబ్బిలి పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్సై రమేష్ వివరాల మేరకు.. దేవాంగుల వీధికి చెందిన ఎస్.మృత్యుంజయరావు(70) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్యుల వద్దకు వెళ్లినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మేదరబంద వద్ద ఉన్న బావిలో పడి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నారు. సోమవారం ఉదయం స్థానికుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతని కుమారుడు రామచంద్రమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఇంటిపెద్ద ఆత్మహత్య

పీఎంపాలెం(విశాఖపట్నం), న్యూస్‌టుడే: ఉరేసుకుని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడినట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు. పార్వతీపురం సమీపంలోని వేమకోటవారివీధికి చెందిన కె.అప్పలనాయుడు(38) నెల రోజుల క్రితం మధురవాడ ప్రాంతానికి కూలి పనుల నిమిత్తం వెళ్లాడు. మద్యానికి బానిసైన ఆయన అనారోగ్యం కారణంగా ఇటీవల స్వగ్రామానికి తిరిగొచ్చి.. రెండు రోజుల క్రితం మళ్లీ వెళ్లాడు. ఆదివారం అర్ధరాత్రి బక్కన్నపాలెం వెళ్లే దారిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పిడుగు పడి మహిళ దుర్మరణం

ఆరుగురికి గాయాలు

గజపతినగరం, న్యూస్‌టుడే: పిడుగుపాటుతో ఓ మహిళ మృతిచెందగా ఆరుగురికి గాయాలైన ఘటన గజపతినగరం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై లక్ష్మణరావు వివరాల మేరకు.. గజపతినగరం మండలం కొత్త శ్రీరంగరాజపురానికి చెందిన బి.అప్పలమ్మ(54) తన పొలంలో దత్తిరాజేరు మండలం గడసాం గ్రామ కూలీలతో కలుపు మొక్కలు తీయిస్తుండగా మేఘాలు కమ్ముకోవడంతో అందరూ చెట్టు కిందకు వెళ్లారు. అక్కడ కూర్చొని భోజనం చేస్తున్న తరుణంలో చెట్టుపై పిడుగుపడి అప్పలమ్మ చనిపోయింది. ఆమెతోపాటు ఉన్న కూలీలు ఆదిలక్ష్మి, పైడిరాజు, సుశీల, మంగమ్మ, రమణమ్మ, లక్ష్మి గాయపడ్డారు. గ్రామస్థులు వీరిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో కార్మికుడి మృత్యువాత

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: అనుమానాస్పదస్థితిలో ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన శృంగవరపుకోట పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ నారాయణమూర్తి వివరాల ప్రకారం వేపాడ మండలం పెదగుడిపాల గ్రామానికి చెందిన ఎం.గణేష్(35) గ్రామస్థులతో కలిసి పెయింటింగ్, పుట్టీ పనులకు ఎస్.కోట వచ్చారు. ఆదివారం రాత్రి తోటి కార్మికులతో కలిసి భోజనం చేసి.. విశాఖ- అరకు రోడ్డులోని నిర్మాణంలో ఉన్న భవనం రెండో అంతస్తులో నిద్రించారు. సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో తోటి కార్మికులు చూసేసరికి భవనం కింది అంతస్తులో విగతజీవిగా పడిఉన్నాడు. అతని భార్య సంతోషి ఫిర్యాదు మేరకు ఎస్సై గంగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.

7,700 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుబడిన సరకుతో అధికారులు

సీతానగరం, న్యూస్‌టుడే: ప్రజా పంపిణీ వ్యవస్థలో సరఫరా చేసిన బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న మూడు వాహనాలను సీజ్ చేసినట్లు విజిలెన్సు, ఎన్‌ఫోర్సుమెంటు అధికారి బి.సింహాచలం తెలిపారు. సోమవారం మండలంలోని కాశాపేట, చినభోగిల, అప్పయ్యపేటలో తనిఖీలు చేస్తుండగా మూడు వాహనాల్లో తరలిస్తున్న 7,700 కిలోల బియ్యం పట్టుబడినట్లు చెప్పారు. సరకుతో పాటు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బొబ్బిలి మండలం పిరిడి, కమ్మవలసకు చెందిన పలువురు స్థానికంగా కొనుగోలు చేసి ఒడిశాలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. సీఎస్‌డీటీ రమేష్‌బాబు, వీఆర్వోలు కుమారస్వామి, నాగమణి, సింహాచలం ఉన్నారు.

రైలు ప్రమాదంలో కూలీ మృతి


కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: బెలగాం రైల్వే గేటు సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొన్న ఘటనలో కూలీ మృత్యువాత పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. గరుగుబిల్లి మండలం ఉద్దవోలుకు చెందిన బాలకృష్ణ(37) ప్రైవేటు కాంట్రాక్టర్ల వద్ద కూలి పనులు చేస్తుంటాడు. సోమవారం బహిర్భూమికి వెళ్లి వస్తుండగా పట్టాలు దాటుతున్న సమయంలో విశాఖ నుంచి రాయపూర్ వెళ్లే పాసింజర్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. బాలకృష్ణకు భార్య చిన్నమ్మి, ఇద్దరు పిల్లలున్నారు. రైల్వే హెచ్‌సీ వి.ఎన్.మూర్తి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కోటదుర్గకు పూజలు

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ కోటదుర్గమ్మను సోమవారం కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించారు. డీఎస్పీ రాంబాబు, సీఐ చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తి ఉన్నారు.



తల్లి సేవలో కలెక్టర్ తదితరులు

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

కొత్త రైల్వేలైన్ ఏర్పాటు చేయాలి

విజయనగరం అర్బన్: విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలను, ఒడిశా రాష్ట్రాన్ని కలుపుతూ నూతన రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. సోమవారం దిల్లీలో రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏళ్లుగా ఈ డిమాండు ఉందని, న్యాయం చేయాలని కోరారు.



రైల్వే మంత్రితో ఎంపీ కలిశెట్టి

లయన్స్ క్లబ్‌కు ఉత్తమ సేవా పురస్కారం




అవార్డు అందజేస్తున్న లయన్స్ జిల్లా గవర్నర్ గోపాలరావు

గరివిడి, న్యూస్‌టుడే: లయన్స్ జిల్లా (విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అరకు, తూర్పుగోదావరి) పరిధిలో పనిచేస్తున్న 68 క్లబ్‌లలో శ్రీరాంనగర్(గరివిడి) ఉత్తమ క్లబ్‌గా ఎంపికైంది. ఆదివారం రాత్రి విశాఖపట్నంలో జరిగిన ఇంటర్నేషనల్ జిల్లా 316ఎ ప్రాంతీయ సదస్సులో లయన్స్ పీడీ విజయకుమార్‌రాజు, జిల్లా గవర్నర్ గోపాలరావు ఈ అవార్డును సంబంధిత ప్రతినిధులకు అందజేశారు. ఈ ఏడాది క్లబ్ అంతర్జాతీయ నిధికి 23 వేల డాలర్ల నిధులు సేకరించి ఇవ్వడంతో పాటు శ్మశానవాటిక అభివృద్ధి, పచ్చదనం పెంపునకు విరివిగా మొక్కలు నాటడం తదితర సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఎంఎస్ఎస్ శర్మ, టి.కమలాకరరావు అంతర్జాతీయ లీడర్ షిప్ అవార్డులు అందుకున్నారు. ఉత్తమ కార్యదర్శిగా ప్రసాద్, ఉత్తమ జిల్లా ఛైర్మన్లుగా కమలాకరరావు, రామకృష్ణ, రవి.. రెండవ ఉత్తమ ప్రెసిడెంట్‌గా ఎస్‌వీఎల్ఎన్.రాజు, కోశాధికారిగా మహేష్ నిలిచారు.

నగరంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: విజయనగరంలో వచ్చేనెల 27 నుంచి 30 వరకు జరగనున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం చీపురుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై చర్చించి వాటికి పరిష్కారం లభించేలా కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. మహాసభల ప్రారంభం రోజున జరిగే భారీ ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆలిండియా నాయకులు రానున్నారన్నారు. జిల్లా కార్యదర్శి నాగభూషణం, సహాయ కార్యదర్శి గౌరీశంకర్, ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జాన్సన్‌బాబు, విద్యార్థులు

బొబ్బిలి
• బొబ్బిలి • రాజాం • గజపతినగరం • చీపురుపల్లి

పీఎఫ్ పింఛను పెంచాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర ఆదేశాల మేరకు పీఎఫ్ పింఛను మొత్తాన్ని పెంచాలని కోరుతూ చీపురుపల్లి ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు విశాఖలోని పీఎఫ్ కమిషనర్ పవన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆర్.శ్రీనివాసపట్నాయక్, నాగేశ్వరరావు, వెంకటరావు, అప్పలనారాయణ తదితరులు సమస్యను వివరించారు. ఉద్యోగ విరమణ తర్వాత రూ.వెయ్యి నుంచి రూ.నాలుగు వేలలోపు పింఛను ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆకలి తీర్చుతున్న రైతు క్యాంటీన్

రామభద్రపురం, న్యూస్‌టుడే: రామభద్రపురం కూరగాయల మార్కెట్లో ఎమ్మెల్యే బేబినాయన సహకారంతో ప్రతి సోమవారం రైతు క్యాంటీన్ ద్వారా అన్నదాతలకు ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. సోమవారం మార్కెట్లో అమ్మకాలు, పనులకు వచ్చిన 1,000 మంది రైతులకు తెదేపా నాయకులు వసంతుల సన్యాసినాయుడు, మజ్జి రమేష్, పోల వెంకటరమణ భోజనాలు వడ్డించారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి	80085 74367
గజపతినగరం	80085 74332
రాజాం	80085 74308
గరివిడి	80085 74348

? రావివలస మండల పరిషత్తు పాఠశాల పరిసరాలు తుప్పలతో నిండి, విషసర్పాలకు నిలయంగా మారాయి. పిచ్చి మొక్కల్ని తొలగించాలని ఎన్నిసార్లు సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదు. - విద్యార్థుల తల్లిదండ్రులు

● తక్షణమే తుప్పలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - ఎంఈవో-2

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? దేవుపల్లి గ్రామం నుంచి కనిమెరక వెళ్లే మార్గంలో ఉన్న విద్యుత్తు స్తంభం పంట పొలాల్లోకి వాలిపోయింది. జోరు గాలి, వర్షానికి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. - స్థానికులు

● త్వరలో స్తంభాన్ని సరిచేస్తాం. - శంకర్రావు, ఏఈ – న్యూస్‌టుడే, బొండపల్లి

? దేవుపల్లికాపాక ప్రాథమిక పాఠశాల ప్రహరీ లేకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి. - స్థానికులు

● గతంలో నిధులు మంజూరైనా నిర్మాణం చేపట్టలేదు. నిధుల కోసం మళ్లీ జిల్లా అధికారులకు నివేదిస్తాం. - భానుప్రకాష్, ఎంఈవో

– న్యూస్‌టుడే, గుర్ల

? తెర్లాం వ్యవసాయశాఖ కార్యాలయం ఆవరణలో పిచ్చి మొక్కలు ఉండడంతో పాములు, పురుగులు సంచరిస్తున్నాయి. - రైతులు

● వెంటనే పరిశీలించి, కార్యాలయం ఆవరణను బాగు చేయించేందుకు చర్యలు చేపడతాం. - జి.సునీల్, ఏవో

– న్యూస్‌టుడే, తెర్లాం

నడక నరకమే..!
నేటిచిత్రం



సంతకవిటి మండలం సోమన్నపేట-శ్రీహరినాయుడుపేట గ్రామాల మధ్య ఉన్న మట్టి రహదారి ఇది. ఇటీవల వర్షాలకు పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా తయారైంది. ద్విచక్ర వాహనాలతో సహా ఏ బండి వెళ్లలేని విధంగా ఉంది. నడిచి వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉందని ప్రజలు వాపోతున్నారు. సోమవారం స్థానికుడు ఇలా మట్టి, రాళ్లతో గోతులు కప్పే ప్రయత్నం చేస్తూ కనిపించారు. పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ ఏఈ రియాజ్ తెలిపారు. – న్యూస్‌టుడే, సంతకవిటి

ఆలయ ప్రతిష్ఠ



బొండపల్లి: మద్దూరు గ్రామంలో బంగారమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. పూజారులు ఆయన్ను పూర్ణకుంభంతో స్వాగతించారు. సర్పంచి ఎం.పైడిపునాయుడు, నాయకులు పాల్గొన్నారు.

గత నిర్వాకం.. అవస్థల్లో బాల్యం
వసతులకు నోచుకోని అంగన్వాడీ కేంద్రాలు

న్యూస్‌టుడే, గజపతినగరం, మెంటాడ

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలు అందిస్తున్న అంగన్వాడీ కేంద్రాలు సమస్యలతో సతమతం అవుతున్నాయి. అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పిన గత ప్రభుత్వం వీటిని గాలికి వదిలేసింది. మొదట కొత్తగా కేంద్రాలు నిర్మిస్తామని, పాత వాటికి మరమ్మతులు చేస్తామని చెప్పి ఆశలు కల్పించింది. నాడు-నేడు పథకంలో కొన్ని కొత్త కేంద్రాలను మంజూరు చేసింది. బిల్లులు ఇవ్వకపోవడంతో గుత్తేదారులు నిర్మాణాలు వదిలేశారు. మరోపక్క అప్పటి సర్కారు పాతవాటి మరమ్మతులకూ చర్యలు తీసుకోలేదు. దీంతో చిన్నారులు, లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఏడాదిగా పనులు చేయక తుప్పలతో నిండిన గజపతినగరం మూడో అంగన్వాడీ కేంద్ర భవనం

మంజూరుతో సరి

గజపతినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గజపతినగరం, దత్తిరాజేరు, మెంటాడ మండలాలకు చెందిన అంగన్వాడీ కేంద్రాలు 284 ఉన్నాయి. వీటిలో 62 కేంద్రాలకు ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. మరో 42 కేంద్రాలు అద్దెలు లేకుండా ప్రభుత్వ ఇతర భవనాల్లో నడుస్తున్నాయి. మిగిలిన 180 ఇరుకు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. గత ప్రభుత్వం నాడు-నేడు రెండో విడతలో ప్రాజెక్టు పరిధిలో 12 భవనాలకు రూ.1.8 కోట్లు కేటాయించింది. అందులో ఇప్పటికీ ఒక భవనం పూర్తి కాలేదు. గజపతినగరం మూడో కేంద్రం, బోలాపేరంకి చెందిన కేంద్రాల పనులు సగంలో వదిలారు. దత్తిరాజేరులో 6, మెంటాడలో 4 కేంద్రాల భవనాలు కొత్తగా మంజూరు చేసినా పనులు ప్రారంభ దశలోనే ఉన్నాయి. చాలా అద్దె ఇళ్లలో ఒకే గదిలోనే పిల్లల ఆటపాటలు, సరుకుల నిల్వ, భోజనం తయారీకి అవస్థలు తప్పడం లేదు. మరుగుదొడ్డి, తాగునీరు కూడా సక్రమంగా లేని పరిస్థితి.

కమిటీల పేరుతో..

గజపతినగరం ప్రాజెక్టు పరిధిలో అద్దె ప్రభుత్వ భవనాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల మరమ్మతులకు రూ.70 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. గజపతినగరం, దత్తిరాజేరు, మెంటాడ మండలాల్లో 42 భవనాలకు నిధులు మంజూరు చేశామనగా.. ఐసీడీఎస్ అధికారులతో తల్లుల కమిటీలు ఏర్పాటు చేయించి, బ్యాంకుల్లో ఖాతాలు తెరిపించారు. ఇప్పటికీ ఖాతాలకు నిధులు జమకాలేదు. దీంతో వారికి నిరాశే మిగిలింది.

అధికారులకు తెలిపాం

గత ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త భవనాల నిర్మాణాలు, మరమ్మతుల గురించి కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేశాం. కొన్ని కేంద్రాలు పూర్తిగా సమస్యల్లో ఉన్న మాట నిజమే. కొత్త ప్రభుత్వంలో వీటి పరిష్కారానికి త్వరలో చర్యలు తీసుకుంటారని భావిస్తున్నాం.

– నాగమణి, సీడీపీవో, గజపతినగరం

తాగునీరు నేలపాలు



గుర్ల మండలం గుజ్జంగివలసలో జల్‌జీవన్ మిషన్ ద్వారా సరఫరా చేస్తున్న ఇంటింటి కుళాయిల నీరు వృథాగా పోతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు ఎండలకు కొన్ని చోట్ల తాగునీటికి ఇబ్బంది అవుతుంటే.. ఇక్కడ ఇలా వృథా చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. కుళాయిల వాల్వ్ పనిచేయకపోవడంతోనే ఇలా అవుతోందని, ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించాలని కోరుతున్నారు. దీనిపై కార్యదర్శి జ్యోతి వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, గుర్ల

చప్టా బాగు చేయరూ

బొబ్బిలి మండలంలోని మెట్టవలస మల్లమ్మ చెరువు చప్టాకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. చెరువు నీరు పంట పొలాలకు పారడానికి వీలుగా తెదేపా పాలనలో చప్టా నిర్మించారు. భారీ వర్షాలకు అది కొట్టుకుపోయి కాలువ కూడా పూడుకుపోయింది. దీంతో నీరు రావడం లేదంటున్నారు. పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. ఉపాధి నిధులతో ప్రతిపాదనలు పంపించామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం



శిథిల భవనం.. ఎప్పటికో మోక్షం?



రైతులకు సేవలు అందించాల్సిన గంట్యాడ వ్యవసాయ కార్యాలయం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. కార్యాలయం స్లాబు పైకప్పు పెచ్చులూడి, గోడలు బీటలు ఏర్పడ్డాయి. దీంతో అధికారులు సమీపంలోని రైతు సేవా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గంట్యాడ వ్యవసాయాధికారి శ్యాంకుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. సమస్యను ఉన్నతాధికారులకు తెలిపామన్నారు.

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

పునాదులకే పరిమితం

రాజాం మండలం రాజయ్యపేటలో రైతు సేవా కేంద్రం పునాదులకే పరిమితమైంది. నిర్మాణం ప్రారంభమై మూడేళ్లు కావస్తున్నా పూర్తికాలేదు. దీంతో అద్దె భవనంలోని ఇరుకు గదిలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అవసరాలకు వస్తున్న రైతులు అవస్థలు పడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ జేఈ ప్రభాకరరావు వద్ద ప్రస్తావించగా నిర్మాణం పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం



పురాతన వంతెనతో చింత



ఆకులోవ గెడ్డపై వెంకంపేట సమీపంలోని వంతెన శిథిలావస్థకు చేరి.. గోడలు విరిగి పడుతున్నాయి. ఎదురెదురుగా వచ్చే వాహనాలు అదుపు తప్పితే గెడ్డలో పడిపోయే ప్రమాదముందని చోదకులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణం, రహదారి బాగుకు అయిదేళ్ల క్రితమే పనులు ప్రారంభించినా పూర్తికాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై జేఈ నాగభూషణం మాట్లాడుతూ.. నిధుల సమస్య ఉందని, గుత్తేదారుకు పనులు పూర్తి చేయమని చెబుతామన్నారు. – న్యూస్‌టుడే, రేగిడి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు, పీడీ

రాజాం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు స్థానిక జీసీఎస్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు బి.దీక్షిత, జి.గోపీచంద్, జి.చరణ్‌రామ్ ఎంపికయ్యారు. వీరిని కళాశాల అధ్యాపకులు జి.రాంబాబు, కె.శ్రీనివాసరావు, పీడీ, చీకటి కేశవనారాయణ సోమవారం అభినందించారు.

రక్తదాన శిబిరం



గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: రక్తదానం చేస్తే.. మరొకరికి ప్రాణదానం చేయడంతో సమానమని జనసేన మండల కన్వీనర్ బొమ్మిడి ఎర్నాయుడు అన్నారు. బుడతనాపల్లి గ్రామంలో సోమవారం 'రాయల్ యూత్' ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 40 మంది యువకులు రక్తదానం చేశారు. సత్యనారాయణ, జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెత్త వేస్తే చర్యలు తప్పవు


కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి, న్యూస్‌టుడే: కాలువల్లో చెత్త, చెదారం వేస్తే చర్యలు తీసుకుంటామని పుర కమిషనర్ రామలక్ష్మి తెలిపారు. సోమవారం పట్టణంలోని శ్వేతాచలపతి పాఠశాల ప్రాంతం, పాత కృష్ణా థియేటర్, గౌడు వీధుల్లో పర్యటించారు. కాలువల్లో వ్యాపారులు చెత్తను పడేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని గుర్తించి నోటీసులు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు.

ఆ నియామకాలు చెల్లవు

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలిలోని సీబీఎం బాలికోన్నత పాఠశాలకు సంబంధించి కన్వీనరు, కరస్పాండెంటు చేపడుతున్న ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది నియామకాలు నిబంధనలకు విరుద్ధమని డీఈవో ప్రేమకుమార్ తెలిపారు. అవి చెల్లుబాటు కావని, ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాలని కోరారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి

రామభద్రపురం, న్యూస్‌టుడే: రామభద్రపురం కూరగాయల మార్కెట్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. మార్కెట్లో రూ.10 లక్షలతో సిమెంటు గచ్చులు, రహదారులు, తాగునీటి వసతుల కల్పనకు సోమవారం సర్పంచి రవ్వా ఈశ్వరరావు, ఉప సర్పంచి చింతల రామకృష్ణతో కలిసి భూమి పూజ చేశారు. ఆపై అగురు, యాత, పెద్దింటి, గొల్ల తదితర వీధుల్లో పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన కుళాయిలను ప్రారంభించారు. నియోజకవర్గంలో రూ.26 కోట్లతో త్వరలో సిమెంటు రోడ్లు, కాలువలు నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. కె.భాస్కరరావు, సి.చిన్నమ్మతల్లి, ముల్లు రాంబాబు, బెవర చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బేబినాయన

అమ్మవు నీవే.. అఖిల జగాలకు..


తెర్లాం: నందబలగలో కనకదుర్గ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చీపురుపల్లి మండలం రామలింగాపురంలోని మానసాదేవి మహా చండీదేవిగా దర్శనమిచ్చారు. పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో కుంకుమార్చనలు, చండీ హోమం నిర్వహించారు.

– న్యూస్‌టుడే, చీపురుపల్లి గ్రామీణం, చీపురుపల్లి, తెర్లాం, బొబ్బిలి


చండీదేవిగా మానసాదేవి


బొబ్బిలిలోని గొల్లవీధిలో అమ్మవారు


ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి

సుపరిపాలనకే శిక్షణ


మాట్లాడుతున్న జడ్పీ డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్

గంట్యాడ, రాజాం, న్యూస్‌టుడే: సుపరిపాలన కోసమే వార్డు సభ్యులు, ఉప సర్పంచుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, వీటిని సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్ తెలిపారు. గంట్యాడలో సోమవారం జరిగిన శిక్షణా కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామ పరిపాలన, పంచాయతీలకు వచ్చే ఆదాయం, ఖర్చులపై అవగాహన ఉండాలన్నారు. ఎంపీడీవో ఆర్వీ రమణమూర్తి, ఈవోపీఆర్డీ భానోజీరావు తదితరులు పాల్గొన్నారు. రాజాంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, రేగిడిలో ఈవోపీఆర్డీ సత్యనారాయణ, మెంటాడలో ఎంపీడీవో పట్నాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

విగ్రహాల ఆవిష్కరణ



రామభద్రపురం, న్యూస్‌టుడే: ఆరికతోట గ్రామంలో దాతలు పెంకి భీమయ్య, పి.కృపారావు, బాజ్జీ, శేఖర్, జార్జ్ కలిసి ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను సోమవారం జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఎంపీపీ సి.లక్ష్మణరావు, నాయకులు పాల్గొన్నారు.

ఎటు వెళ్లాలన్నా గోతులే..!


ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలకు వెళ్లే మార్గం

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పారిశ్రామికవాడలోని రహదారులు గోతులమయంగా మారాయి. దాదాపు అన్ని పరిశ్రమలకు వెళ్లే దారుల్లో ఎక్కడికక్కడ గోతులు ఏర్పడటంతో లారీలు కదలడం లేదు. దీనివల్ల పారిశ్రామికవాడకు ముడిసరకు తీసుకెళ్లలేమంటూ స్థానిక లారీ యజమానులు తేల్చి చెప్పేస్తున్నారు. వాడకు నాలుగు వైపులా ఉన్న బీటీ రహదారులు ఇటీవల వర్షాలకు మరింత గోతులమయంగా మరాయి. వాటిలో వాహనాల చక్రాలు దిగిపోతున్నాయి.

ఏళ్లుగాలేని మరమ్మతులు

ఏపీఐఐసీ పరిశ్రమలోని రహదారుల మరమ్మతులను పదేళ్లుగా చేపట్టలేదు. దీంతో పరిస్థితి దారుణంగా ఉంది. కొన్నిచోట్ల పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను గోతుల్లో వేసి వాహనాలు నడుపుతున్నారంటే అర్థం చేసుకోవచ్చు. ఇకనైనా రహదారులు కొత్తగా వేయాలని కోరుతున్నారు. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని ఏపీఐఐసీ జోనల్ ప్రబంధకుడు మురళీ మోహన్ తెలిపారు. నిధులు రాగానే పనులు చేస్తామన్నారు.



పాత వ్యాపారులతో డీసీ సమీక్ష

బొబ్బిలి, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకోవాలని అబ్కారీ శాఖ ఉప కమిషనర్ బాబ్జీరావు కోరారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలోని పాత వ్యాపారులతో సమీక్షించారు. సాయంత్రానికి బొబ్బిలి నియోజకవర్గంలోని 23 దుకాణాలకు 147 దరఖాస్తులు వచ్చాయని, ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని చెప్పారు.

విద్యుత్తు ప్రమాదాలపై అప్రమత్తత

గజపతినగరం, న్యూస్‌టుడే: విద్యుత్తు ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ జిల్లా విజిలెన్సు సీఐ రామకృష్ణ అన్నారు. కెంగువ గ్రామంలో విద్యుత్తు సమస్యలు, పొదుపు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యుత్తు సమస్యలు ఏర్పడితే నేరుగా అధికారులకు తెలపాలని సూచించారు.


జనసేన కమిటీల నియామకం


వివరాలు వెల్లడిస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి అప్పలస్వామి

బొబ్బిలి, న్యూస్‌టుడే: జనసేన పట్టణ, మండల కమిటీలను అధిష్ఠానం ఆదేశాల మేరకు నియమించామని నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జనసేన పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా లెంక రమేష్, మండలాధ్యక్షులుగా ఎ.నాగేశ్వరరావు (బొబ్బిలి), మహంతి ధనుంజయ్ (రామభద్రపురం), గంటేడ శ్రీనివాసరావు(బాడంగి), బూర్లి రామకృష్ణనాయుడు(తెర్లాం)ను నియమించినట్లు ప్రకటించారు. నియోజకవర్గ వీర మహిళా సమన్వయకర్తలుగా పాండ్రంకి ప్రవల్లిక, ఎస్.రామలక్ష్మి, బి.ఉషారాణి, బి.లక్ష్మి, పి.జోత్స్న, బి.శోభారాణి నియమితులయ్యారు.

అమ్మవారి ఉత్సవాలకు ఆహ్వానం

గరివిడి, బొబ్బిలి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవానికి హాజరు కావాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావును ఆలయ అధికారులు ఆహ్వానించారు. సోమవారం రాజాంలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి.. ఆయనను పూలమాలతో సత్కరించి ఉత్సవాలకు రావాల్సిందిగా కోరారు. అదేవిధంగా బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబినాయనను దేవాదాయ శాఖ అధికారులు ప్రత్యేకంగా కలిశారు. వేడుకకు హాజరుకావాలని ఆహ్వానపత్రికను అందజేశారు.


ఎమ్మెల్యే కళాకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఆలయ అధికారులు

కార్మికుల ఆందోళన


కోటలో నినాదాలు

బొబ్బిలి, న్యూస్‌టుడే: అర్హులైన తోపుడు, రిక్షా బళ్ల కార్మికులకు ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయాలని కార్మిక సంఘ నేత ముల్లు వెంకటరమణ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో జెండా వీధి కూడలి నుంచి కోట వరకు ర్యాలీ నిర్వహించారు. జీవితాంతం కష్టపడుతున్న కార్మికులకు 40 ఏళ్లు నిండగానే పింఛను సదుపాయం కల్పించాలని డిమాండు చేశారు. అనంతరం కోటలో ఎమ్మెల్యే బేబినాయనకు వినతిపత్రం అందజేశారు. నిబంధనల మేరకు పథకాలు వర్తింపజేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు.

ఉపాధి పనుల గుర్తింపు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పలు పంచాయతీల్లో ఉపాధిహామీ పనులు గుర్తించడానికి గ్రామ సభలు నిర్వహించారు. అందులో భాగంగా చేపట్టాల్సిన పనులు, ఉన్న వనరులను గ్రామ పటం గీసి, అందులో గుర్తించారు. పిరిడి, కారాడ, పక్కి గ్రామాల్లో సోమవారం వీటిని ఏర్పాటు చేశారు. ఏపీవో లక్ష్మీపతిరాజు, సాంకేతిక సహాయకులు రామారావు, సత్యనారాయణ, శంకరరావు, క్షేత్రసహాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.


పిరిడిలో పనులు గుర్తించడానికి వేసిన గ్రామ పటం

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి అరుణశ్రీ

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో బొబ్బిలి మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా కమిటీ ఛైర్మన్ అరుణశ్రీ అతిథిగా హాజరై, మాట్లాడారు. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్పుడే న్యాయం కోసం ఎలా కోర్టులను ఆశ్రయించాలో తెలుస్తుందని చెప్పారు. మహిళల కోసం రూపొందించిన చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, సహాయ కార్మిక శాఖ అధికారి కె.గౌరీశంకరరావు, ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి, న్యాయవాది డి.లక్ష్మీదీపవల్లి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
విజయనగరం పట్టణం - 80089 02900
విజయనగరం గ్రామీణం - 80085 74317
ఎస్.కోట - 80085 74326
భోగాపురం - 80085 74319

? భోగాపురం పెదహరిజనవీధికి వెళ్లే మార్గంలో వంతెన శిథిలావస్థలో ఉంది. – రామారావు, స్థానికుడు

● సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. - కిశోర్‌కుమార్, ఎంపీడీవో

– న్యూస్‌టుడే, భోగాపురం

? దేశపాత్రునిపాలెం పంచాయతీ శివారు రెల్లికాలనీకి సమీపంలోని రక్షిత రెసిడెన్స్ ఆవరణలో తుప్పలు పెరిగిపోయి ఇబ్బంది పడుతున్నాం. - ఎం.అశోక్ కుమార్, స్థానికుడు

● పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం. - వి.కృష్ణారావు, కార్యదర్శి

– న్యూస్‌టుడే, కొత్తవలస

? నందిగుడ్డిలో నివాసాల మధ్య పశువులు తిరుగుతున్నాయి. - స్థానికులు

● పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - కె.సాంబమూర్తి, ప్రజారోగ్య అధికారి

? ఇందిరానగర్‌లో రహదారి అధ్వానంగా మారింది. – స్థానికులు

● మరమ్మతులు చేస్తాం. - కె.శ్రీనివాస్, ఏఈ, నగరపాలక సంస్థ

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

తీగల తొలగింపు

స్పందనకు వందనం

లక్కవరపుకోట: జమ్మాదేవిపేట ర.భ అతిథి గృహం నుంచి రంగారాయపురం వెళ్లే మార్గంలో విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకుని ప్రమాదకరంగా ఉన్నాయి. దీనిపై 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికతో సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్తు శాఖ ఇంజినీరింగు అధికారి ఐ.కృష్ణ స్పందించారు. సిబ్బందితో తీగలు తొలగించారు.

విజయవాడకు ప్రత్యేక బస్సులు

శృంగవరపుకోట: భక్తుల సౌకర్యార్థం విజయవాడకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఎస్.కోట డిపో మేనేజరు రమేష్ తెలిపారు. ప్రత్యేక ప్యాకేజీలతో కోరిన ఆలయాల సందర్శనకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్ బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. వివరాలకు సూపరింటెండెంటు(73829 23679), డిప్యూటీ సూపరింటెండెంటు(94905 83579)ను సంప్రదించాలన్నారు.

విజయనగరం

● విజయనగరం ● నెల్లిమర్ల ● ఎస్.కోట

మంజూరైన పనులు	82
పూర్తిచేసినవి	42
కొనసాగుతున్నవి	02
ప్రారంభించాల్సినవి	38

మంజూరైన నిధులు	రూ. 7.09 కోట్లు
ఖర్చు చేసినవి	రూ. 1.53 కోట్లు
మిగిలినవి	రూ. 5.56 కోట్లు



పనులు చేయకపోవడంతో అధ్వానంగా దర్శనమిస్తోన్న కాలువ

పనులు 82 పూర్తిచేసినవి 42

న్యూస్‌టుడే, నెల్లిమర్ల

నెల్లిమర్ల నగర పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులు పుష్కలంగా ఉన్నా.. అభివృద్ధి పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. నెల్లిమర్ల, జరజాపుపేట ప్రాంతాల్లో 82 పనులను అధికారులు గుర్తించారు. అభివృద్ధి చేసేందుకు రూ.7.09 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం 42 పనులు మాత్రమే పూర్తి చేశారు. మిగిలినవి పట్టించుకోకుండా వదిలేశారు. కాలువలు, సిమెంట్ రహదారులు లేని చోట వర్షం పడితే ప్రజల అవస్థలు వర్ణనాతీతం. రోడ్లు బురదమయంగా.. గుంతలతో దర్శనమిస్తున్నాయి.



రహదారికి నోచుకోని నెల్లిమర్ల తెలకల వీధి

టెండర్లు పిలిచాం.. రెండు ప్రాంతాల్లో మిగిలి ఉన్న 38 పనులు చేసేందుకు టెండర్లు పిలిచి.. ప్రక్రియ పూర్తి చేశాం. సంబంధిత గుత్తేదారులు పనులు చేసేందుకు ముందుకు రావడంలేదు. మళ్లీ టెండర్లు పిలిచేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రక్రియ పూర్తి చేసిన వెంటనే పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తాం.

– త్రినాథ్‌రావు, ఏఈ, నెల్లిమర్ల నగర పంచాయతీ

ప్రారంభించకుండానే నిలిచిపోయాయ్..

గత ప్రభుత్వం వైఫల్యంతో రెండు ప్రాంతాల్లో 38 అభివృద్ధి పనులు ప్రారంభించకుండానే నిలిచిపోయాయి. టెండర్లు పూర్తి చేసినప్పటికీ పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకురాలేదు. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. వీటిలో సిమెంటు రహదారులు, కాలువలు, తాగునీటి సరఫరా పైపులైన్లు, పారిశుద్ధ్య నిర్వహణ, చెరువులు సుందరీకరణ తదితర పనులు చేయాల్సిఉంది. నెల్లిమర్ల అగురువీధి వద్ద తాగునీటి రిజర్వాయర్‌కు ప్రత్యామ్నాయ పైపులైను వేయాల్సిఉంది. ఈ పనులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజా ప్రతినిధుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. 42 పనులకు రూ.1.53 కోట్లు మాత్రమే వినియోగించారు. మిగిలిన నిధులు మూలుగుతున్నాయి.

అథ్లెటిక్స్‌లో పతకాల పంట



పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు

విజయనగరం క్రీడలు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 4 నుంచి 6 వరకు జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. 11 స్వర్ణాలు, ఆరు రజతాలు, మూడు కాంస్య పతకాలు సాధించారు. సతీష్, మధు, శేఖర్, లక్ష్మణ్ శిక్షకులుగా, శివ, నాని, సుమతి ప్రబంధకులుగా వ్యవహరించారు. వారిని అథ్లెటిక్స్ సంఘం సీఈవో హైమా, కార్యదర్శి గౌతమ్ కుమార్, సెలక్షన్ కమిటీ ఛైర్మన్ నారాయణరావు అభినందించారు

పైడితల్లి జాతరకు ఊపందుకున్న పనులు



గ్రిల్స్‌కు రంగులు వేస్తున్న కార్మికులు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగరంలో ఈనెల 15న జరగనున్న పైడితల్లి ఉత్సవాలకు పనులు ఊపందుకున్నాయి. నగరపాలిక ఆధ్వర్యంలో సెంటర్ డివైడర్లకు రంగులు వేస్తున్నారు. మరోవైపు రహదారులకు మరమ్మతులు చేపడుతున్నారు. ఇప్పటికే పుత్సలవీధి నుంచి కాళ్ల నాయుడు మందిరం వరకు రూ.12.40 లక్షలతో బీటీ దారి వేశారు. అక్కడి నుంచి ఉల్లివీధి మీదుగా కన్యకాపరమేశ్వరి కోవెల వరకు సీసీ మార్గాన్ని పునరుద్ధరించారు. కొత్తపేట నీళ్ల ట్యాంకు నుంచి ఐస్ ఫ్యాక్టరీ కూడలి, గంటస్తంభం - పాత బస్టాండు, సీఎంఆర్ కూడలి - ఎన్సీఎస్, రామారాయుడుదారి- ఎంఆర్ కళాశాల తదితర ప్రాంతాల్లో కార్మికులు రంగులు వేస్తున్నారు. పలుచోట్ల విద్యుత్తు దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. 10వ తేదీ నాటికి పూర్తిచేస్తామని కమిషనర్ నల్లనయ్య తెలిపారు.

దుకాణ సముదాయం నిర్మాణానికి చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఎస్.కోట మేజరు పంచాయతీలో దుకాణ సముదాయం నిర్మాణానికి.. నిధులు మంజూరు చేయించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సోమవారం నిర్వహించిన పంచాయతీ ప్రత్యేక సమావేశంలో ఆమె పాల్గొన్నారు. శిథిలావస్థలో ఉన్న దుకాణాలు పునరుద్ధరణ, అనధికార లేఅవుట్లు, జాతీయ రహదారి ఆక్రమణలు తదితర సమస్యలను పలువురు ప్రస్తావించారు. వాణిజ్య సముదాయంలోని దుకాణాల లీజుల పెంపుపై వార్డు సభ్యుల అభిప్రాయాలు తీసుకొని పెంచేందుకు నిర్ణయించారు. సర్పంచి జి.సంతోషికుమారి, ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుబ్బలక్ష్మి, ఎంపీడీవో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డులో వెళ్లేదెలా?



జొన్నాడ జాతీయ రహదారి నుంచి ఆకులపేట, డి.తాళ్లవలస, గంట్లాం మీదుగా అక్కివరం కూడలి వరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిధులతో చేపట్టిన బీటీ రహదారి నిర్మాణం చాలాకాలంగా అసంపూర్తిగా నిలిచిపోయింది. ప్రస్తుతం కల్వర్టు నిర్మాణాలు, మెటల్ పనులు చేయాల్సి ఉంది. దీనిపై పీఐయూ జేఈ వెంకటేష్ వద్ద ప్రస్తావించగా.. మెటల్ అందుబాటులో లేకపోవడంతో పనులు చేపట్టలేదని, రెండో పొర వేసి తొందరగా పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

– న్యూస్‌టుడే, డెంకాడ

ప్రమాదకరంగా దారి

నగరంలో రహదారులు పరిస్థితి దారుణంగా మారింది. కొన్నేళ్లుగా నిర్వహణ లేకపోవడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత పెద్దవయ్యాయి. నగరపాలిక పరిధిలోని 30వ డివిజన్‌లో కొత్త, పాత ధర్మపురికి వెళ్లే మార్గం అధ్వానంగా దర్శనమిస్తోంది. అడుగుకో గుంత ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి, బాగు చేయాలని కోరుతున్నారు. పరిశీలించి, నిధుల లభ్యత మేరకు పనులు చేపడతామని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం



వ్యాధుల నియంత్రణపై దృష్టి



సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

విజయనగరం వైద్య విభాగం, న్యూస్‌టుడే: క్షయ, కుష్ఠు వ్యాధుల నియంత్రణలో భాగంగా ప్రతిఒక్కరూ క్షేత్రస్థాయిలో పక్కాగా విధులు నిర్వహించాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు ఆదేశించారు. జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సోమవారం తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆశాలు, ఏఎన్ఎంలు, వైద్యాధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని సూచించారు. వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లలో నమోదు చేయాలన్నారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ పర్యవేక్షణాధికారిణి కె.రాణి, డీఎన్ఎంవో అర్చనదేవి తదితరులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారానికి కృషి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చే వినతులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత విభాగాధిపతులను కమిషనరు పి.నల్లనయ్య ఆదేశించారు. సోమవారం నగరపాలిక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలువురు వినతిపత్రాలు అందించారు. 55వ సచివాలయ పరిధిలో వీధి దీపాలు వెలగడం లేదని, జమ్ములో కాలువలు నిర్మించాలని, అంబేడ్కర్ భవన్ పూర్తి చేయాలని, రెవెన్యూ [illegible] [illegible] వచ్చాయన్నారు. ప్రజారోగ్య అధికారి కె.సాంబమూర్తి, సహాయక సిటీ ప్లానరు రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కమిషనరు నల్లనయ్య

నవోదయ విద్యార్థులకు శిక్షణ



మట్టి నమూనా తీస్తున్న అధికారులు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఎస్.కోట మండలం కిల్తంపాలెం పంచాయతీలో ఉన్న నవోదయ పాఠశాల విద్యార్థులకు విజయనగరం ఆత్మసంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భూసార పరీక్షల్లో మట్టి నమూనా ఎలా తీయాలి, ఎందుకు తీయాలి, దాని ఉపయోగాలు చిన్నారులకు వివరించారు. ఏవో లీలారాణి, కొత్తవలస సబ్ డివిజన్ ఏడీ ఎల్.విజయ, ఆత్మ సిబ్బంది స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

అమ్మ రూపం.. అపురూపం



మహాచండీదేవి అవతారంలో విజయదుర్గమ్మ



కరెన్సీ నోట్లతో కొండపల్లితోట కనకదుర్గ



గాజుల అలంకరణలో గాజులరేగ అమ్మవారు

దేవీ నవరాత్రుల్లో భాగంగా నగరంలో వెలసిన అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమిస్తున్నారు. నాగోజీపేటలో వేంచేసి ఉన్న తల్లి సోమవారం మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గాజులరేగ కొండపల్లితోటలో కరెన్సీ నోట్లుతో, సాలివీధిలో లలితాదేవిగా దర్శనభాగ్యం కల్పించారు. – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

కలుషిత నీటితో ఇక్కట్లు

న్యూస్‌టుడే, నెల్లిమర్ల, భోగాపురం

మంచినీటి పథకాలు, ట్యాంకులు, పైపులైన్ల నిర్వహణను అధికారులు సిబ్బంది నిర్లక్ష్యం చేస్తుండడంతో నీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కొన్ని చోట్ల ట్యాంకులు శిథిలావస్థకు చేరుతుండగా.. మరికొన్ని చోట్ల పైపులు లీకవుతున్నా.. పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శిథిలావస్థకు చేరిన జరజాపుపేట తాగునీటి ట్యాంకు మెట్లు

శిథిలావస్థకు చేరడంతో..

జరజాపుపేట ప్రాంతానికి చెందిన తాగునీటి రిజర్వాయర్ మెట్లు శిథిలావస్థకు చేరాయి. రిజర్వాయర్‌ను శుభ్రం చేసేందుకు మెట్ల మార్గంలో పైకి ఎక్కేందుకు సంబంధిత సిబ్బంది భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ఏడు నెలలుగా శుభ్రం చేయకుండా వదిలేశారు. తాగునీరు కలుషితమైన పరిస్థితి కనిపిస్తోందని నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఏఈ రాజాను వివరణ కోరగా.. శిథిలావస్థకు చేరిన మెట్లను నిర్మించేందుకు రూ.3 లక్షల ఎస్ఎఫ్‌సీ నిధులతో టెండర్లు పిలిచామని, త్వరలో నిర్మాణం చేపడతామన్నారు.



దిబ్బలపాలెంలో కొంతకాలంగా ట్యాంకు నుంచి లీకవుతున్న తాగునీరు

అతిసారం బారిన పడినా..

భోగాపురం మండలం దిబ్బలపాలెంలో రెండు నెలల క్రితం కలుషిత నీరు కారణంగా అతిసారం ప్రబలి ఇంటికి ఒకరిద్దరు మంచాన పడ్డారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టినా పరిస్థితి అదుపులోకి రాలేదు. అప్పటికే కొన్ని నెలల నుంచి పంచాయతీ ప్రధాన ట్యాంకుకు లీకేజీ సమస్య ఉంది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కొంత వరకు అరికట్టినా ప్రధాన పైపులైను వద్ద లీకేజిని విడిచిపెట్టేశారు. తాగునీటి పైపులైను పరిస్థితిలో కొంతవరకే మార్పు వచ్చిందని, పూర్తిస్థాయిలో అరికట్టకపోవడంతో నీరు కలుషితమయ్యే ప్రమాదముందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టం జరగకముందే పట్టించుకోవాలని కోరుతున్నారు.

హామీ నెరవేరనుంది: ఎంపీ

శృంగవరపుకోట: చిట్టంపాడు గిరిశిఖర గ్రామానికి రోడ్డు నిర్మాణానికై పీఎం జన్‌మన్ పథకం కింద రూ.11.30 కోట్లు కేటాయించడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శమని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేరనుందని, గిరిశిఖర గ్రామాల రవాణా సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసేందుకు కృషి చేస్తామన్నారు.

వేధింపుల కేసు నమోదు

వేపాడ: పాటూరు గ్రామానికి చెందిన 29 ఏళ్ల యువకుడు వెంటపడి వేధిస్తున్నాడంటూ అదే గ్రామానికి చెందిన 21ఏళ్ల యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై దేవి కేసు నమోదు చేశారు.

పంట పొలాల పరిశీలన

విజయనగరం గ్రామీణం: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, సద్వినియోగం చేసుకుంటే ప్రయోజనాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారిణి హర్షలత సూచించారు. పినవేమలిలో వీఏఏ రమేష్‌తో కలిసి పంట పొలాలను పరిశీలించి, అన్నదాతలకు సూచనలిచ్చారు.

తపాలా సేవలు విస్తరించాలి

విజయనగరం కోట: తపాలాశాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ కోరారు. జాతీయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం నగరంలోని కార్యాలయంలో జరిగిన కార్యశాలలో మాట్లాడారు. సేవలను విస్తరించాలని సూచించారు. బాగా పనిచేసిన అధికారులు, సిబ్బందిని సత్కరించి, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఎంపీడీవోకు వినతి

జామి: జామి మాధవరాయమెట్ట కాలనీకి అనుకుని ఉన్న ఓ క్రషరు వల్ల ఇబ్బందిగా ఉందని స్థానికులు సోమవారం ఎంపీడీవో ఎన్.అప్పారావుకు వినతిపత్రం ఇచ్చారు. ధూళి, దుమ్ముతో వ్యాధులు వస్తున్నాయని, క్రషరు సౌండ్‌కు పాఠశాలలోని విద్యార్థులకు పాఠాలు అర్థంకావటంలేదని పేర్కొన్నారు.



బాధ్యతల స్వీకరణ

నెల్లిమర్ల: నెల్లిమర్ల ఎంపీడీవోగా కె.రామకృష్ణరాజు, అబ్కారీశాఖ సీఐగా వెంకట్రావు, ఇరిగేషన్ ఏఈగా పి.శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎంగా సురేష్ బాధ్యతలు స్వీకరించారు. **డెంకాడ:** డెంకాడ ఉప తహసీల్దారుగా డి.గాంధీ, రీసర్వే డీటీగా బి.ప్రసాద్, గొలగాం, అమకాం, చింతలవలస-1, సింగవరం వీఆర్వోలుగా ఎస్.శిరీష, ఎం.శ్రీదేవి, వి.తిరుమలరావు, కె.కోమలి బాధ్యతలు స్వీకరించారని తహసీల్దారు వి.పద్మావతి తెలిపారు.

ద్రావణాల తయారీ

కొత్తవలస: గులివిందాడ గ్రామ సంఘం ఆధ్వర్యంలో పలు పత్ర ద్రావణం, పొటాషియం లోపాన్ని సరిదిద్దేందుకు జిల్లేడు ద్రావణం తయారు చేశారు. ఎఫ్‌పీఓ ఏపీఎం ఎ.వెంకటరమణ, ఎల్-1 ఎం.శ్రావ్య, ఐసీ ఆర్పీలు, వీవోఏలు పాల్గొన్నారు.

పంచాయతీలకు నియంత్రణ అధికారాలు

కొత్తవలస, న్యూస్‌టుడే: పారిశుద్ధ్యం - ప్రజారోగ్యానికి సంబంధించి గ్రామ పంచాయతీలకు కొన్ని చట్టపరమైన నియంత్రణ అధికారాలు ఉన్నాయని ఈవోపీఆర్డీ కె.ధర్మారావు చెప్పారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల ఉప సర్పంచులు, పంచాయతీకి ఇద్దరు వార్డు సభ్యులకు రెండ్రోజులు నిర్వహించే శిక్షణ కార్యక్రమం సోమవారం ఎంపీడీవో ఎస్.రమణయ్య ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ప్రారంభమైంది. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ.. పబ్లిక్ రహదారులపై మురుగు నీరు ప్రవహించకుండా నిరోధించే అధికారం పంచాయతీకి ఉందని అన్నారు. మురికి కాలువలపై అనుమతి లేని నిర్మాణాలు నిషేధమని చెప్పారు. పారిశుద్ధ్య విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా పరిశీలకుడు కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలసలో శిక్షణ ఇస్తున్న ఈవోపీఆర్డీ ధర్మారావు

వాలంటీర్లను కొనసాగించాలని ఆందోళన

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: వాలంటీర్ల ఇబ్బందులను అర్థం చేసుకుని వారిని కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండు చేశారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఏపీ గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనరు పి.నల్లనయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ 2019లో సచివాలయ వ్యవస్థ కంటే ముందుగానే వాలంటీర్ల వ్యవస్థ ఏర్పాటైందని, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంతో ఎంతో బాధ్యతగా పనిచేస్తున్నారన్నారు. నాయకులు రవీంద్ర, మోహన్ ఆదిత్య, కుమారి, ఎస్.రంగరాజు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు, వాలంటీర్లు

సమాచారం సకాలంలో అందించాలి

కొత్తవలస, వేపాడ, న్యూస్‌టుడే: ప్రతి పౌరుడు కోరిన సమాచారాన్ని సకాలంలో అందించాలని సమాచార హక్కు చట్టం చెబుతోందని ఆ చట్టం జిల్లా సమన్వయ కమిటీ సభ్యుడు డి.సూర్యారావు అన్నారు. చట్టం వచ్చి 19 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా స.హ.చట్టం ఉద్యమకారులు ఎన్.సాంబమూర్తి, డి.ధనుంజయ్‌తో కలిసి సోమవారం తహసీల్దారు నీలకంఠరావు, ఎంపీడీవో రమణయ్య, సీఐ షణ్ముఖరావుకు వినతి పత్రాలు అందజేశారు. ప్రతీ కార్యాలయంలో 17 అంశాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలని, పీఐఓ, ఏపీఐవో మొదటి ఎఫిలియేట్ అధికారుల బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కోరారు. ● ప్రభుత్వ కార్యాలయాల్లో స.హ.చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో సూర్యనారాయణకు వినతి పత్రం ఇచ్చారు.



తహసీల్దారు నీలకంఠరావుకు వినతి పత్రం ఇస్తున్న సూర్యారావు తదితరులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై రణస్థలం మండలం దన్నానపేట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పూసపాటిరేగ మండలం గోవిందపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. జేఆర్‌పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. రణస్థలంలో పని ముగించుకొని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో అటుగా వచ్చిన స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు చూసి గాయపడిన వారిని విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి పంపించి అవసరమైన సాయాన్ని అందించారు. జేఆర్‌పురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.25 కోట్లతో పనులకు శంకుస్థాపనలు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో ఈ నెల 14 నుంచి 20 వరకు రూ.25 కోట్లతో ఉపాధిహామీ మెటీరియల్ కాంపోనెంటు కింద అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరగనుందని, కూటమి నాయకులందరూ పాల్గొనాలని ఎమ్మెల్యే లలితకుమారి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని, ఇంకా పలు అభివృద్ధి పనులు చేయాల్సి ఉందన్నారు.

ప్రగతి సాధనపై గ్రామాల్లో అవగాహన

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు సభ్యులు ప్రస్తుత శిక్షణను గ్రామ ప్రగతి సాధనకు వినియోగించాలని ఎంపీడీవో ఎస్.అప్పారావు, పంచాయతీ విస్తరణాధికారి కేఎస్ఎస్.కుమార్ అన్నారు. మండలంలోని ప్రతి పంచాయతీ ఉప సర్పంచులు, ఇద్దరు వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధికి.. ఆదాయం రాబట్టుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాల గురించి చెప్పారు.

ముగిసిన చదరంగం పోటీలు

విజయనగరం క్రీడలు, న్యూస్‌టుడే: విజయనగరంలోని రెవెన్యూ హోమ్‌లో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు సోమవారంతో ముగిశాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 250 మంది తరలివచ్చారు. ఎం.జ్ఞానసాయి సంతోష్(కాకినాడ) ప్రథమస్థానం, ఎం.వెంకట రిత్విక్(విశాఖపట్నం) ద్వితీయ స్థానం, ఎస్.వరహాలు(విశాఖపట్నం) తృతీయ స్థానం సాధించారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, ఎంవీ.కృష్ణాజీ విజేతలను అభినందించారు. చదరంగం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.సురేష్, కార్యదర్శి జగదీష్, కోశాధికారి కేకే.జగన్నాథం పాల్గొన్నారు.



చదరంగం పోటీల నిర్వాహకులు